క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


దత్తాత్రేయ స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే

నవాబుపేట: గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని ఘన్గాపూర్‌లోని దత్తాత్రేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

మహాత్మా జ్యోతిబాపూలేకు అభ్యర్థుల ఎంపిక


రవికుమార్


నర్సింహులు

దోమ : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టీజీటీ, పీజీటీ ఫలితాల్లో మండల అభ్యర్థులు సత్తాచాటారు. మండల పరిధిలోని మోత్కుర్‌కు చెందిన బి.రవికుమార్, జి.నర్సింహులు పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ)లో సత్తా చాటి పరిగి పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలేలో ఉద్యోగానికి సెలక్ట్ అయ్యారు. రవి కుమార్ హిందీ సబ్జెక్ట్ కాగా, నర్సింహులు మ్యాథ్స్ సబ్జెక్ట్‌కు విధుల్లో చేరినట్లు వారు ఆదివారం ఒక ప్రకటనలో చెప్పారు.

మహారాష్ట్రలో రుణమాఫీ సంబురాలు



పూణెలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో మహారాష్ట్రలో ఉంటున్న కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గిరిజన సంఘాల నాయకులు స్థానిక నేతలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇందులో కేతావత్ హన్మ్యానాయక్, శివపవర్, శంకర్ నాయక్, అంతారం మల్లేష్ ఉన్నారు.

ఆధార్‌లింక్ లేక అవస్థలు


ఆధార్ కార్డులు ఇస్తున్న రైతులు

బొంరాస్‌పేట: రుణమాఫీ అందలేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎన్కేపల్లి, రేగడిమైలారం తదితర గ్రామాల్లో ఎస్‌బీఐ సిబ్బంది ఆధార్‌లింకు కోసం పత్రాలను రైతుల నుంచి సేకరించారు. ప్రతి గ్రామానికి పంట రుణమాఫీ పొందిన రైతుల్లో నేటికి ఆధార్ కార్డుల లింక్ లేకపోవడంతో మాఫీ పొందలేక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రుణాలు ఇచ్చిన సంబంధిత బ్యాంకుల సిబ్బంది జాబితా ఆధారంగా రైతుల నుంచి గ్రామాల వారీగా సందర్శించి ఆధార్‌కార్డుల నఖలు, భూమి పట్టాపాసుబుక్కులు, పంట రుణం పొందిన పత్రాలను రైతుల నుంచి సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

ఎడతెరిపి లేని వర్షం

కొడంగల్ : నియోజకవర్గంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. జనాలు బయటకు రాలేకపోతున్నారు. పొలాలకు వెళ్లడానికి రైతులకు ఆటంకం ఏర్పడింది. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. వర్షం నీటికి మురుగు కాల్వల్లో చెత్తాచెదారం చేరింది. దీంతో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ కాలనీల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు చేయించారు.

మాఫీ అందలేదు..!

దుద్యాల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన రుణమాఫీ హామీ.. ప్రస్తుతం చేసిన మాఫీకి పొంతనలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగే శ్రీనివాస్ ఫైర్ అయ్యాడు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం విడుదల చేసిన రుణమాఫీలో లక్ష లోపు పంట రుణాలు ఉన్న చాలా మంది రైతులకు మాఫీ కాకపోవడంతో వారు పడుతున్న ఆందోళనలు చెందుతున్నారని అన్నారు. బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలు దాదాపు రూ.64వేలకుపై మాటే. అందులో 10వ వంతు మాత్రమే చెల్లించి క్షీరాభిషేకాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.

వానాకాలం..జర భద్రం

అసలే వర్షాకాలం.. ఇంటా.. బయటా నిత్యం విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉంటాయి. గాలి వానకు స్తంభాలు పడిపోయి.. విద్యుత్ తీగలు తెగిపడి.. ఎప్పుడు ఎలాంటి ముప్పు పొంచి ఉంటుందో తెలియని పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజలు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే వాటి బారి నుంచి తప్పించుకోవచ్చని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు..

- ఈ సీజన్‌లో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువ
- నిర్లక్ష్యం చేస్తే అంతే సంగతులు
- సొంతంగా మరమ్మతులు చేయొద్దు
- సమస్యలుంటే ఫిర్యాదు చేయండి


దౌల్తాబాద్ సబ్‌స్టేషన్

దౌల్తాబాద్: వర్షాకాలంలో విద్యుత్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వర్షంతో పాటు గాలివీచే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు ఉన్న చోట యంత్రాలతో దుక్కిదున్నే క్రమంలో రైతులు పొరపాటున స్తంభాలను తాకితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పంట పొలాల్లోని విద్యుత్ మోటార్లకు అందించే విద్యుత్ తీగలు కింద వేలాడినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి తీగలను సరిచేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ మోటార్లు బిగించే క్రమంలో...

పంటలు సాగు చేసే ప్రతి రైతు వేసవిలో మోటార్లను తీసేసి వర్షాలు పడే సమయంలో విద్యుత్ మోటార్లను అమర్చే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులే మరమత్తులు చేస్తూ ఉంటారు. దీంతో మోటార్లు కాలిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కావునా రైతులు సొంతంగా మరమత్తులు చేసుకోవద్దని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

పంటల రక్షణకు విద్యుత్‌ను వాడొద్దు

పంటలు చేతికొచ్చే సమయంలో కొంతమంది రైతులు పంట చుట్టూ ఇనుప వైర్‌ను ఏర్పాటు చేసి దానికి విద్యుత్‌కు అనుసంధానం చేస్తారు. దీంతో జంతువుల బారి నుంచి పంటలు కాపాడుకోవచ్చు. కానీ, అది చాలా ప్రమాదం. ఇదే సమయంలో రైతులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువ.

జాగ్రత్తలు తప్పనిసరి

- వర్షాలు పడేటప్పుడు స్టే వైర్, విద్యుత్ లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిలబడొద్దు.
- రోడ్డు మీదగాని నీటిలో కాని విద్యుత్‌తీగ పడి ఉన్నట్లు గుర్తిస్తే తీగను తొక్కకూడదు. వాటిపై నుంచి వాహనాలు నడపకూడదు.
- చెట్ల కొమ్మలపై భవనాలపై తెగిపడ్డ తీగలు ఉన్నట్లయితే వాటిపై అప్రమత్తంగా ఉండాలి.
- విద్యుత్ తీగలు తెగిపడినట్లుగా గుర్తిస్తే వెంటనే మీ సమీప సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలి.

అధికారులను సంప్రదించాలి

రైతులు వర్షాకాలం నేపథ్యంలో సొంతంగా మరమత్తులు చేపట్టకుండా సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించాలి. లేనిచో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు చిన్నపాటి పొరపాటు కూడా చేయొద్దు.

–మహిపాల్, ఏఈ, దౌల్తాబాద్

విద్యుత్‌పై అప్రమత్తత అవసరం


తెగిన విద్యుత్ వైర్లను సరి చేస్తున్న లైన్‌మెన్

దుద్యాల్: ప్రస్తుతం వానలు కురుస్తున్నాయి.. గాలికి విద్యుత్ వైర్లు తెగిపోయే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమతంగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలం కావడంతో గాలి వానలకు దూలిలకు..వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ వైర్లు తెగిపోయే ప్రమాదం ఉంది. ప్రజలు అప్పమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు తెలియజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెట్ల కొమ్మల కారణంగా విద్యుత్ వైర్లు తెగిపోయే ఘటనలు చాలా జరుగుతుంటాయి. ఆదివారం మండలంలోని హస్నాబాద్ గ్రామంలోని ప్రధాన చౌరస్తా, గాంధీ చౌక్ దగ్గర వర్షానికి విద్యుత్ వైర్లు తెగిపోవడంతో లైన్‌మెన్ వెంట్రాములు సరిచేశారు. ప్రజలు ఇళ్లలో విద్యుత్ వైర్లు ప్రమాదంగా ఉంటే వెంటనే విద్యుత్ అధికారులకు తెలియజేసి మరమత్తు చేసుకోవాలన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయండి


తాండూరు టౌన్ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

పరిగి: సమగ్రశిక్షాలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ అన్నారు. సమగ్రశిక్షా ఉద్యోగులు ఆదివారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. ఆయన లేకపోవడంతో పీఏకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత 21 సంవత్సరాలుగా సమగ్రశిక్షా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా విద్యాశాఖలో పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న సరైన జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశైలం, నజీర్, మోహన్, రఘు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ఆందోళన

తాండూరు టౌన్ : సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు ఉద్యోగులు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆదివారం ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత 18 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 22వేల మంది ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిన సమగ్ర శిక్షలో అరకొర వేతనానికి విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు 25 రోజుల పాటు రిలే నిరసనలు చేసిన ఉద్యోగుల వద్దకు ప్రస్తుత రేవంత్ రెడ్డి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు మినిమం టైమ్ స్కేల్ కల్పించాలన్నారు. అలాగే ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ. 5 లక్షల సౌకర్యం కల్పించాలని, పీటీఐలకు 12 నెలల జీతం ఇవ్వాలని, పదవీ విరమణ సమయంలో బెనిఫిట్స్ కింద రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌సింగ్, జనార్దన్, శ్రీనివాస్, మంగమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు


తాండూరు రూరల్ : బోనాలతో మహిళలు


పరిగి: బోనాల ఉత్సవాల్లో మహిళలు

పరిగి: పట్టణంలో మైసమ్మ బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని పురవీధుల గుండా ఊరేగింపుగా డప్పుచప్పుళ్ల, యువత నృత్యాల మధ్య ఆలయానికి చేరుకొని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉట్టిపడిన పండుగ కళ

తాండూరు రూరల్ : మండలంలోని మల్కాపూర్‌లో గ్రామదేవత మైసమ్మకు బోనమెత్తారు. సందర్భంగా మైసమ్మ అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో పోతురాజు విన్యాసం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవిసింధే, రఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వడ్ల మల్లేశం, గని కార్మిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎస్ పండరి, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి.. చల్లంగా చూడమ్మ

దుద్యాల్: మినీ మేడారంగా పేరొందిన పోలేపల్లి రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక హోమాలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ రాజేందర్ రెడ్డి తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. హోమంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఇకపై ప్రతి పౌర్ణమి రోజున ప్రత్యేక హోమాలు నిర్వహిస్తామని.. భక్తులు ఎంత మందయిన పాల్గొనవచ్చని ఈఓ రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయరాం, భక్తులు పాల్గొన్నారు.

వర్షాలపై జాగ్రత్త

తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి

మోమిన్‌పేట: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు, ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి సూచించారు. వాగులు, వంకలు వద్ద రైతులు, కూలీలు, ప్రయాణికులు జాగ్రత్తగా చూసుకొని వెళ్లాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలని అన్నారు. వాగులు, వంకల్లో నీరు తక్కువగా ఉందని దాటే ప్రయత్నం చేయొద్దని చెప్పారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దని, కూలిపోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అత్యవసరమైతే 100కు డయల్ చేయాలని తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

కుల్కచర్ల: రైతుబీమా పొందేందుకు అన్నదాతలు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వీరస్వామి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో నూతనంగా పట్టాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ధరణి ప్రారంభం నుంచి రైతుబీమాకు దరఖాస్తు చేయనివారు స్థానిక వ్యవసాయ విస్తరణ ఆధికారి వద్ద లేదా మండల కేంద్రంలోని రైతువేదికలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రెన్యూవల్ చేసుకోండి

యాలాల: రైతుబీమా రెన్యూవల్ డేటాను రైతులందరూ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి యాదగిరి ఒక ప్రకటనలో కోరారు. బీమా రెన్యూవల్‌కు ఈ నెల 30 చివరి తేదీ. జూన్ 28 వరకు కొత్తగా పట్టా పాసుబుక్కులు పొందిన రైతులు ఆగస్టు 5వ తేదీలోగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు.

వీఆర్‌ఏ మాణయ్య మృతి



బంట్వారం: అనారోగ్యంతో ఆర్‌ఏ మాణయ్య (65) ఆదివారం మృతి చెందారు. మండలంలోని నాగవరం గ్రామానికి చెందిన మాణయ్య చాలా కాలంగా వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నారు. వయస్సు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగం కల్పిస్తామని గత ప్రభుత్వం జీఓ నంబర్ 81–85 జారీ చేసింది. అయినప్పటికీ ఇంతవరకు వారసులను ఉద్యోగాల్లోకి తీసుకోకపోవడంతో మాణెయ్య మనోవేదనకు గురై అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపై వీఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు అంజిలయ్య సానుభూతి వ్యక్తం చేసి సంతాపం ప్రకటించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరఫున రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.

అడుగడుగునా గుంతలే!


గుంతలమయంగా మారిన రోడ్డు

ధారూరు: మండల పరిధిలోని అంపల్లి చౌరస్తా నుంచి దోర్నాల్ గ్రామం వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డు నుంచే తాండూరు, పరిగి, కొడంగల్ బొంరాస్‌పేట్, వికారాబాద్‌లకు రాకపోకలు కొనసాగుతున్నాయి. అడుగడుగునా గుంతలు పడి పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఈ రోడ్డు ప్రయాణించిన వాహనాలు మెకానిక్ షెడ్డుకు చేరుతున్నాయి. వెంటనే మరమ్మతులు చేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

తండాలకు బురద రోడ్లే దిక్కు


బురదమయంగా డీప్లానాయక్‌తండా రోడ్డు

బొంరాస్‌పేట: మండల పరిధిలో జాతీయ రహదారి 163 ఉన్నప్పటికీ కొన్ని గిరిజన తండాలకు బురద రోడ్లే ఉన్నాయి. మండలం పరిధిలోని మెట్లకుంటకు నేటికి మట్టిరోడ్లే దర్శనమిస్తాయి. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ గ్రామాలుగా ఉన్న తండాలకు బీటీరోడ్లు ఏర్పాటయ్యాయి. కానీ, తండాలకు ప్రస్తుతం వర్షాకాలంలో బురదదారులే దిక్కయ్యాయి. మూడుమామిళ్లతండా గ్రామపంచాయతీ పరిధిలోని డీప్లానాయక్‌తండా, బండమీదితండా, వెంకట్‌నాయక్‌తండా, బాపన్‌చెర్వుతండా గ్రామపంచాయతీ పరిధిలోని మేర్గోనిబాయితండా, పాల్కితండాతోపాటు మండలంలోని ఆయా గ్రామపంచాయతీల పరిధిల్లో రోడ్లు బురదమయంగా మారాయి.

దరఖాస్తుల ఆహ్వానం

దౌల్తాబాద్: నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయధికారి లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల పేర్లు ఏమైనా తప్పులు ఉన్నా సరిచేసుకోవచ్చని రెన్యూవల్ చేసుకునేందుకు 30వరకు చివరి తేదీ ఉందన్నారు. కొత్త పాసుపుస్తకాలు వచ్చిన రైతులు పాసుబుక్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.

చెట్లకిందకు వెళ్లొద్దు

యాలాల: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాలాల ఎస్ఐ శంకర్ కోరారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లు, భవనాలు, పాడుబడ్డ నివాసాల నుంచి అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్ష సమయంలో విద్యుత్ స్తంభాలు, కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పొలాలకు వెళ్లే రైతులు ఫోన్ల వినియోగం, చెట్ల కింద తలదాచుకోవద్దన్నారు.

ప్రజావాణితో ప్రయోజనం

బంట్వారం: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేయొచ్చన్నారు. మండల ప్రజలు కలెక్టరేట్‌కు వెళ్లకుండా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలోనే ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

కుల్కచర్ల: ముప్పై సంవత్సరాల తరువాత అందరూ ఒక్కచోటికి చేరారు. తమకు విద్యాబుద్ధులు నెర్పిన గురువులను గురుపౌర్ణమిరోజు కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం కుల్కచర్ల మండలం పుట్టాపహడ్‌లో 1993–94 విద్యాసంవత్సరం 10వ తరగతి చదువుకున్న అప్పటి విద్యార్థులు కలుసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. కలిసి చదువుకున్న తమ సహచర స్నేహితులతో నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంజిలయ్యగౌడ్, కేశవులు, బాల్‌రాజ్, విద్యార్థులు రమేశ్, మహేశ్, వెంకట్రాములు, విష్ణు, గురునాథ్‌రెడ్డి, స్వర్ణలత, హైమావతి, నిర్మల పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు


గిరిప్రదక్షిణలో భక్తులు


పెద్దేముల్: ప్రత్యేక పూజలు అందుకుంటున్న పాండురంగనాథుడు

పెద్దేముల్: మండలంలోని జనగాంలో ఆదివారం గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం పాండురంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగిస్తూ, భజన సంకీర్తన మధ్య పల్లకీ సేవా నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టి, ,భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో..

తాండూరు టౌన్ : వేదవ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకుని డివిజన్ తపస్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసమహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. తపస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంత్ రావు మాట్లాడుతూ.. వ్యాసుడు గురుపరంపరకు ఆధ్యుడన్నారు. చతుర్వేదాలు, అష్టాదశ పురాణాలు రచించి లోకానికి జ్ఞాన భిక్ష పెట్టిన తొలి గురువని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆనందం, జిల్లా మీడియా కన్వీనర్ బస్వరాజ్, నరహరి రెడ్డి, ఆకుల శ్రీశైలం, సిద్ధిరామేశ్వర్, సంతోష్, రాజేష్, శ్రీనివాస్, రవి, అనిల్, ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గురువు ప్రణవ స్వరూపం

అనంతగిరి:గురువు ప్రణవ స్వరూపమని సీనియర్ అడ్వకేట్ గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని సత్యసాయి జ్ఞానకేంద్రంలో ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి భావం అలవర్చుకోవాలన్నారు. మనిషి కోపం వదిలి గురువు ద్వారా సాధన చేసి ఆత్మజ్ఞానం పొందాలన్నారు. అనంతరం శ్రీలతారెడ్డి మాట్లాడుతూ.. గురువు అంటే ఆధ్యాత్మిక జ్ఞానం అందించేవాడన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ గౌడ్, బందెప్పగౌడ్, బసవేశ్వర్, వేణుగోపాల్, విఠోబా, నర్సింలు, పాల్గొన్నారు.


హిందీ టీచర్ విద్యావతిని సన్మానిస్తున్న కౌన్సిలర్ సాహు శ్రీలత

వైభవంగా పాంబండ గిరిప్రదక్షిణ

కుల్కచర్ల: పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ఆదివారం గిరిప్రదక్షిణ కార్యక్రమం శోభాయమానంగా సాగింది. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాంబండ క్షేత్రం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రతీ పౌర్ణమిని పురస్కరించుకుని ఇక్కడ గిరిప్రదక్షిణ చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గురువులకు సన్మానం

తాండూరు టౌన్ : గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని పలువురు చిన్నారులు వారి గురువులను ఆదివారం సన్మానించారు. పట్టణ మున్సిపల్ 24వ వార్డు బీజేపీ కౌన్సిలర్ సాహు శ్రీలత, తనకు చిన్నప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన హిందీ ఉపాధ్యాయురాలు విద్యావతిని శాలువా, పూలమాలతో సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన యోగా గురువు రాధికను విద్యార్థులు సాహు శ్రీసాన్వి, సాహు శ్రీసాహితి, గాయత్రి, శివాని, ఆశ్రిత తదితరులు ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు.